గొప్ప వైద్య వేత్త డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ రణదీప్ గులేరియా, డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు

నల్లకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మూడు పద్మ అవార్డులను స్వీకరించిన తొలి వైద్యుడు, గొప్ప వైద్య వేత్త డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి అని పలువురు వక్తలు అభివర్ణించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నార్త్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 5వ ఐఎంఏ తెలంగాణ స్టేట్ కన్‌హ - 2025 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఏఐజీ చైర్మన్ డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి దంపతులను బుధవారం నగరంలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎయిమ్స్ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ రణదీప్ గులేరియా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తన వైద్య ప్రయాణంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.సురేంద్రనాథ్, డాక్టర్ జి.ఆర్.గణేష్‌రావు, డాక్టర్ బి.సాయిసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ సృజన, ఉన్నతాధికారులు

11వ విడత ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని మహిళ, చిన్న పిల్లల రక్షణ విభాగం డీసీపీ కె.సృజన తెలిపారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ సెల్, పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సృజన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌ను పోలీసులు, చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో కలిసి చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాలకార్మికులను రక్షిస్తామని తెలిపారు. సమావేశంలో ఏసీపీ కె.సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా పిల్లల సంరక్షణ కమిటీ ప్రతినిధి కె.నాగేందర్‌రెడ్డి, మేడ్చల్ ప్రతినిధి రాజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీలతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'సిగాచి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడిన సిగాచి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు సురేష్ బాబు డిమాండ్ చేశారు. సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు, తద్వారా జరిగిన తీవ్ర ప్రాణనష్టం పైన మానవ హక్కుల వేదిక బృందం బుధవారం నిజనిర్ధారణ జరిపింది. ఇంకా శవాల వెలికితీత పూర్తి కాకపోవడం, కంపెనీ పేరు తప్ప యాజమాన్యం పేర్లు ఇప్పటికీ బయటికి రాకపోవడం, మృతుల కుటుంబాలకు సమాచారం అందకపోవడం వంటి విషయాలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక హైదరాబాద్ ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, కమిటీ సభ్యులు వసంతలక్ష్మి, రోహిత్ ఉన్నారు.

'57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దళితులలో అత్యంత వెనుకబడిన ఎంబీసీ 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని 57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాల దాసరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బైరి వెంకటేష్ మాట్లాడుతూ దళితులకు వచ్చే అన్ని ఫలాలు అట్టడుగున ఉన్న 57 కులాలకు కూడా దక్కాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాల దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మద్దెల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'దేశ ప్రజల ప్రయోజనాలు ట్రంప్ వద్ద తాకట్టు'

హిమాయత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రయోజనాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దగ్గర మోదీ తాకట్టు పెట్టారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూర్ ధర్మేంద్ర ఆరోపించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై దాడులు జరుగుతున్నా.. మోదీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అమెరికాలో భారతీయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చలో అమెరికన్ కాన్సులేట్ కార్యక్రమాన్ని చేపట్టారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ప్రారంభమైన నిరసనను సమీపంలోనే అడ్డుకుని నేతలను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరసన కార్యక్రమంలో సమాఖ్య నేతలు శ్రీనివాసులు, సల్మాన్‌బేగ్, కల్యాణ్, నాగరాజు, మధుకర్, సునీల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం దక్కేలా కృషి చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం ఓ లేఖ రాశారు. రాష్ట్రపతి ఆమోదానికి బిల్లులు పంపి చాలాకాలం అవుతోందని, బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడింది

● శాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడి.. లోపభూయిష్టంగా ఉందని శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అబిడ్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన హై పెర్ఫార్మన్స్ అకాడమీల స్థాపనపై నూతన క్రీడా విధానంలో కనీస ప్రస్తావన లేదని విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు నెగ్గిన వారికి ఇచ్చే ఉద్యోగాలపై పాలసీలో స్పష్టత ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. శాట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కోచ్‌ల క్రమబద్ధీకరణ, కొత్త కోచ్‌ల నియామకాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్టేడియాలు, స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.

మణికొండలో రూ. కోటిన్నర విలువైన డ్రగ్స్ స్వాధీనం

● ఇద్దరు స్మగ్లర్స్ అరెస్ట్

నార్సింగ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాలనీలో రూ. కోటిన్నర విలువైన 650 గ్రాముల హెరాయిన్ డ్రగ్స్, 84 గ్రాముల పాపీస్ట్రా మాదక ద్రవ్యాలను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తుల వద్ద డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మాదక ద్రవ్యాలను రాజస్థాన్ నుంచి నగరానికి దిగుమతి చేసుకున్నట్లు తెపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలే మిన్న : కిషన్‌రెడ్డి



టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలను అందజేస్తున్న కిషన్‌రెడ్డి

బోరబండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శ్రీరామ్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ఏబీవీ ఫౌండేషన్ తరఫున టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలను బుధవారం మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 100 టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలను ప్రభుత్వ పాఠశాలలకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో శానిటేషన్ సిబ్బందిని నియమించాలని సూచించారు. గతంలో కన్నా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మెరుగైందని, విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోందని చెప్పారు. హైదరాబాద్ డీఈవో రోహిణి మాట్లాడుతూ బోరబండ బలహీనవర్గాల కాలనీ నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. బోరబండ గురుకుల పాఠశాలలో వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్ మండల ఉప విద్యాధికారి శామ్యూల్ రాజ్, శ్రీరామ్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాంతయ్య, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రహ్మతున్నీసా, వీరా కుమారి, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, పార్టీ నాయకులు కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణ, టి.లక్ష్మణ్, షర్మిల జాదవ్, చేకూరు హనుమంతు నాయుడు, షాబాజ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సామాజిక వర్గం అభివృద్ధికి కృషి

పంజాగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్నూరు కాపు సామాజికవర్గం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తంరావు అన్నారు. ఇటీవల సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన ఆయన కార్యవర్గ సభ్యులతో వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మిని బుధవారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్, కోశాధికారి కంచి సత్యనారాయణ పటేల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేణుగోపాల్ పటేల్, నాయకులు వాసదేవుల వెంకటనర్సయ్య పటేల్, నేతి వెంకటేశ్వర్లు పటేల్, పి.వేణుపటేల్, ఉప్పు సత్యనారాయణ పటేల్, చొప్పరి శ్రీనివాస్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



కేశవరావును కలిసిన మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

అందరి సహకారంతో ప్రశాంతంగా ఎల్లమ్మ కల్యాణం



ఈవో మహేందర్‌గౌడ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

● ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం ప్రశాంతంగా జరిగిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయానికి చేరుకుని క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడారు. మంగళవారం కల్యాణం జరిగిన తీరు ఎదురైన ఇబ్బందుల గురించి అధికారులు, భక్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈవో మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు కరుణాకర్‌రెడ్డి, వనం శ్రీనివాస్, గోపీలాల్ చౌహాన్, బలరాం, గుడిగె శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కూల్చివేతలు నిర్వహిస్తున్న హైడ్రా సిబ్బంది

జీహెచ్‌ఎంసీ స్థలంలో ప్రైవేట్ ప్రహరీ

● కూల్చివేసిన హైడ్రా

బంజారాహిల్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ స్థలంలో ప్రైవేట్ వ్యక్తి ప్రహరీ నిర్మించి స్థలం తనదేనని బోర్డు పెట్టాడు. హైడ్రా సిబ్బంది బుధవారం కూల్చివేతలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలో జీహెచ్‌ఎంసీకి 400 గజాలు మిగులు స్థలం ఉంది. ఓ వ్యక్తి దాన్ని ఆక్రమించి స్థలం తనదేనంటూ ప్రహరీ నిర్మించాడు. అంతేగాదు సూచికబోర్డు ఏర్పాటు చేశాడు. కాలనీవాసులు హైడ్రా అధికారులను కలిశారు. ఎమ్మెల్యే లే అవుట్ ప్రకారం అది జీహెచ్‌ఎంసీకి చెందిన ఖాళీ స్థలం అని చెప్పారు. విచారణ చేపట్టిన హైడ్రా స్థలం జీహెచ్‌ఎంసీకి చెందినదే అని నిర్ధారించుకొని కూల్చివేతలు చేపట్టారు.



నిమ్స్ ఎదురుగా మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతులు చేస్తున్న హైడ్రా సిబ్బంది

నిమ్స్ ఎదురుగా మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతులు

పంజాగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే నిమ్స్ ఎదురుగా వర్షం నీరు నిలిచిపోతోంది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా వర్షం పడుతుండడంతో స్థానికులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో హైడ్రా సిబ్బంది నిమ్స్ వద్దకు చేరుకున్నారు. వర్షం నీటిని తొలగించారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మోహన్‌రావు తెలిపారు.

విద్యుత్ మరమ్మతుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

● హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్‌ఈ వెంకన్న

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టే సమయంలో సిబ్బంది భద్రతా ప్రమాణాలు తప్పనిసరి పాటించాలని హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ) వెంకన్న సూచించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో వారం రోజులుగా డివిజన్, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్ భద్రత దినోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మెహిదీపట్నం డివిజన్‌లో నిర్వహించిన భద్రత దినోత్సవంలో విద్యుత్ సిబ్బందికి భద్రత పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల సమయంలో ముందుగానే లైన్ క్లియర్ తీసుకొని ఆ తర్వాతే పనులు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలపై పనులు చేసేటప్పుడు సేఫ్టీ బెల్ట్‌ని విధిగా ధరించాలని, సబ్‌స్టేషన్లలో హెల్మెట్ ధరించి పనులు చేయాలని సూచించారు. ఏబీ స్విచ్‌లు, ఎర్తింగ్ రాడ్లు, ఫ్యూజ్ వేయడం వంటి పనులు నిర్వహించినప్పుడు చేతులకు రబ్బరు తొడుగులు వేసుకోవాలన్నారు. లైన్‌క్లియర్ ఇచ్చిన ఫీడర్ ఏబీ స్విచ్‌వద్ద 'మెన్ ఆన్‌లైన్' అను హెచ్చరిక బోర్డు తప్పనిసరిగా తగ్గించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈ, ఏడీఈలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ భద్రత పరికరాలను సిబ్బందికి అందజేస్తున్న వెంకన్న

9న ఖైరతాబాద్‌లో ఫుడ్ లైసెన్స్ మేళా

ఖైరతాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఆధ్వర్యంలో ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) జారీ చేసే లైసెన్స్‌లను పొందగోరే వారు ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిన జరగనున్న ఈ మేళాలో దరఖాస్తు చేసుకుంటే సత్వరమే జోనల్ కమిషనర్ ద్వారా లైసెన్స్‌లు అందనున్నాయి. 9వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో మేళా ప్రారంభమవుతుందని కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఇతర వివరాలకు 7331189774లో డాక్టర్ శ్రీవెంక(ఫుడ్ సేఫ్టీ అధికారి), 7993354252లో ఫుడ్ సేఫ్టీ అధికారి కె.సౌమ్యరెడ్డిని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

వెంగళరావునగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు కోరారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బంజారాహిల్స్ సర్కిల్ ఎస్‌ఈ కరుణాకర్ బాబు, డీఈ హనుమంత రెడ్డి, ఏడీఈ బాలకృష్ణ, ఏఈ తిరుపతి రావు బుధవారం మధురానగర్ కాలనీలోని సాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీహాల్లో కాలనీవాసులతో సమావేశమయ్యారు. సమస్యలను కాలనీవాసులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో విద్యుత్ వైర్లకు ఆటంకం కలిగించే చెట్లకొమ్మలను కొట్టివేసిన వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. రోజుల తరబడి చెట్లకొమ్మలు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉంటుండడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ఏ-బ్లాక్‌లో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఈ-బ్లాక్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చెట్లకొమ్మలను తొలగించాల్సిన బాధ్యత తమదేనని, సంబంధిత కాంట్రాక్టర్ వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తారని ఎస్‌ఈ కరుణాకర్‌బాబు అన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పోలీసులు కొట్టడం వల్ల నా కుమారుడు నడవలేక పోతున్నాడు

● మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

బంజారాహిల్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తీవ్రంగా కొట్టడం వల్ల తన కుమారుడు నడవలేని స్థితికి చేరుకున్నాడని ఓ తండ్రి మానవ హక్కుల కమిషన్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. గతేడాది డిసెంబర్‌లో షేక్ అబ్దుల్ రహమాన్ అనే వ్యక్తి బాత్ రూమ్‌లో స్నానం చేస్తుండగా ఓ మైనర్(17) వీడియో తీశాడు అనే ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే పోలీసులు తన కుమారుడినీ తీవ్రంగా కొట్టడం వల్ల నాలుగు నెలలుగా నడవలేని పరిస్థితికి చేరుకున్నారని, ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మైనర్ తండ్రి దగ్గుబాటి రాంబాబు ఇటీవల మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం తన కుమారుడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు రాంబాబు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మైనర్‌కు నోటీసు ఇచ్చి పంపించినట్లు తెలిపారు. తాము ఎవరినీ కొట్టలేదని, రాంబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

5 నుంచి సిల్క్ ఎగ్జిబిషన్



మంత్రి సీతక్కను ఆహ్వానిస్తున్న నిర్వాహకుడు

బంజారాహిల్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చేనేతకారులు నాణ్యతతో కూడిన సిల్క్, కాటన్, లెనిన్ వస్త్రాలను అందజేస్తున్నారని రాష్ట్ర మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలోని ఇండియన్ గ్యాలరీలో ఈనెల 5 నుంచి ఏర్పాటు చేస్తున్న సిల్క్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆమె బుధవారం ఆవిష్కరించారు. బోనాలు, వరలక్ష్మీవ్రతాలకు ప్రత్యేక వస్త్రాలను ఏర్పాటు చేశామని నిర్వాహకులు వినయ్ కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన చెందేరి, కోలకబ్రోటా, ఉప్పాడ, జమ్దాని, కాంత, బెనారస్, గద్వాల్, గుజరాత్, టసర్, పోచంపల్లి, ఇక్కత్, కాశ్మీరితో పాటు పలు ఫ్యాన్సీ డిజైనరీ, ఆభరణాలు వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 13 వరకూ ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

దోమల వృద్ధిని అడ్డుకునేందుకు చర్యలు

బంజారాహిల్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దోమల వృద్ధిని అడ్డుకునేందుకు జీహెచ్‌ఎంసీ ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బంజారాహిల్స్‌లోని బంజారా లేక్‌లో గుర్రపుడెక్క, చెత్తను తొలగించేందుకు ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్ మిషిన్‌లను, కార్డింగ్ కార్యకలాపాలను బుధవారం ఆమె జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో అంటువ్యాధుల బారిన పడకుండా నగరవాసులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించాలి

బంజారాహిల్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నాలా పొంగి మురుగు బస్తీలోకి రావడంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ఫిలింనగర్ బసవతారకం బస్తీవాసులు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు వారు వినతిపత్రం ఇచ్చారు.



సన్మానం పొందిన ఉద్యోగులు

వాటర్‌బోర్డులో 53 మంది ఉద్యోగ విరమణ

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డులోని వివిధ హోదాల్లో పనిచేసిన 53 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. బోర్డు పరిధిలోని పలు డివిజన్లలో పనిచేసిన ముగ్గురు డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ముగ్గురు సీనియర్ ఆఫీసర్లతోపాటు మరో 47 మంది వివిధ హోదాల్లో పనిచేశారు. వీరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎం సురేష్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమీర్‌పేటలో రక్తదానం

అమీర్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో అమీర్‌పేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సీఏ విద్యార్థులు, సిబ్బంది రక్తాదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ అమీర్‌పేట బ్రాంచి జోనల్ అడ్మిన్ ప్రిన్సిపాల్ ఎస్.ఎం. వలీ, బ్రాంచి అకాడమిక్ ప్రిన్సిపాల్ అశోక్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండలస్థాయి కన్వీనర్లు అయూబ్‌ఖాన్, రమేష్, సభ్యులు శ్రీనివాసరావు, జితేందర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాల్సిందే

ఖైరతాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిందేనని సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్యార్థులను తరలించే బస్సులు, వ్యాన్లు, ఆటోల డ్రైవర్ల తనిఖీలు ప్రతీ రోజు ఉంటాయని ఆయన తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలుచోట్ల తనిఖీలు చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. ఆటోలో ఎక్కువమంది పిల్లలను తరలిస్తున్న వారిపై రెండు కేసులు, డ్రైవర్ పక్కన విద్యార్థులను కూర్చోబెట్టిన వారిపై 6 కేసులు, యూనిఫాంలో లేని డ్రైవర్లపై 9 కేసులు, రాంగ్ రూట్‌లో వెళ్తున్న వారిపై 137 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే, మద్యం తాగి స్కూల్ బస్సు నడుపుతున్న ఓ డ్రైవర్‌ను, వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ఎర్రగడ్డ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆస్పత్రిలోని రోగులకు, వారి బంధువులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. క్లబ్ దిల్‌సుఖ్‌నగర్ శాఖ అధ్యక్షుడు లయన్ ఎం.రాజశేఖర్ మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ దిల్‌సుఖ్‌నగర్ శాఖ కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి నాగభూషణం, సభ్యులు ఆర్‌సీ రవీందర్, చంద్రశేఖర్‌రెడ్డి, లింగారెడ్డి, డాక్టర్ గట్టు శ్రీనివాసులు, చంద్రమోహన్, పందెం కృష్ణ, హరికృష్ణ పాల్గొన్నారు.

ఎల్లమ్మ కల్యాణంలో చెలరేగిన దొంగలు

● 13 సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాల అపహరణ

అమీర్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవాల్లో దొంగలు చేతివాటం చూపారు. క్యూలైన్‌లు, ప్రవేశ ద్వారం వద్ద భక్తులను టార్గెట్ చేసి 13 సెల్‌ఫోన్లు, డబ్బు, బంగారం ఆభరణాలను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేట కల్యాణానికి వచ్చిన సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన వరలక్ష్మి(45) వద్ద ఉన్న సెల్‌ఫోన్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాజు(43) సెల్‌ఫోన్, మేడ్చల్‌కు చెందిన ఎల్లంకి శ్వేత(32) బ్యాగులోని సెల్‌ఫోన్, రూ.4 వేలను దొంగలు కాజేశారు. బహదూర్‌పల్లికి చెందిన ఆకుల కవిత(43) వద్ద ఖరీదైన సెల్‌ఫోన్, బాలానగర్‌కు చెందిన గృహిణి సంధ్య(34) బ్యాగులోని సెల్‌ఫోన్, అంబర్‌పేటకు చెందిన కళావతి(52) వద్ద సెల్‌ఫోన్, ఫతేనగర్‌కు చెందిన ర్యాపిడో డ్రైవర్ వెంకట్‌రెడ్డి(31) వద్ద సెల్‌ఫోన్, మల్కాజ్‌గిరికి చెందిన గృహిణి సుగుణ(42) వద్ద సెల్‌ఫోన్, డి.మాధవి(35) వద్ద సెల్‌ఫోన్, ఎల్బీనగర్‌కు చెందిన ప్రేమలత(36) వద్ద సెల్‌ఫోన్, ఆలయం సమీపంలో భోజనం చేస్తుండగా బాలానగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి సాహితి(25) వద్ద సెల్‌ఫోన్, మల్కాజ్‌గిరికి చెందిన గృహిణి జ్యోత్స్న(35) వద్ద ఉన్న పర్సు కొట్టేశారు. ఆలయం క్యూలైన్‌లో ఉండగా లింగంపల్లికి చెందిన భారతీబాయి(60) వద్ద 18 గ్రాముల బంగారు చైన్, సెల్‌ఫోన్, సికింద్రాబాద్‌కు చెందిన రాజేష్(51) ఆలయం బయట భోజనం చేస్తున్న సమయంలో పర్సు కాజేశారు. అమీన్‌పూర్‌కు చెందిన దంపతులు గంగాధర్(65), విజయ(62)కు చెందిన 3.2 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని దొంగలు అపహరించారు. జగద్గిరిగుట్టకు చెందిన గాజుల వ్యాపారం చేసే వీరమణి(57) మెడలోని 3.5 గ్రాముల బంగారు గొలుసును కొట్టేశారు. ఆరుబయట క్యూలైన్‌లో ఉన్నప్పుడు సరూర్‌నగర్‌కు చెందిన లక్ష్మమ్మ(70) మెడలోని 3.5 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆరుబయట క్యూలైన్‌లో ఉన్న నాగోల్‌కు చెందిన గృహిణి రమాదేవి(51) వద్ద రూ.1500తో పాటు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ కార్డున్న పర్సు కాజేశారు. అమ్మవారి దర్శనం కోసం బయటకు వచ్చిన రాజేంద్రనగర్‌కు చెందిన విజయ(60) బంగారు గుండ్ల హారం పోయినట్లు ఫిర్యాదు చేశారు. పిక్ ప్యాకెటింగ్ గ్యాంగ్‌లు చెలరేగిపోవడంతో విలువైన ఆభరణాలు, డబ్బు, ఫోన్లు పోవడంతో బాధిత భక్తులు ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన మఫ్టీ, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, సివిల్ పోలీసులు ఉన్న ఆలయం ప్రాంగణంలో 19 చోరీ కేసులు నమోదు కావడం గమనార్హం. భక్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇప్పటికే ఈ కేసులకు సంబంధించి పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

గొప్ప వైద్యవేత్త డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి


డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ రణదీప్ గులేరియా, డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు

నల్లకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మూడు పద్మ అవార్డులను స్వీకరించిన తొలి వైద్యుడు, గొప్ప వైద్యవేత్త డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి అని పలువురు వక్తలు అభివర్ణించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నార్త్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 5వ ఐఎంఏ తెలంగాణ స్టేట్ కనహ - 2025 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఏఐజీ చైర్మన్ డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి దంపతులను బుధవారం నగరంలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎయిమ్స్ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ రణదీప్ గులేరియా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తన వైద్య ప్రయాణంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.సురేంద్రనాథ్, డాక్టర్ జి.ఆర్.గణేష్‌రావు, డాక్టర్ బి.సాయిసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

11వ విడత ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ సృజన, ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని మహిళ, చిన్న పిల్లల రక్షణ విభాగం డీసీపీ కె.సృజన తెలిపారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ సెల్, పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సృజన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌ను పోలీసులు, చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో కలిసి చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాలకార్మికులను రక్షిస్తామని తెలిపారు. సమావేశంలో ఏసీపీ కె.సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా పిల్లల సంరక్షణ కమిటీ ప్రతినిధి కె.నాగేందర్‌రెడ్డి, మేడ్చల్ ప్రతినిధి రాజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీలతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'సిగాచి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడిన సిగాచి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు సురేష్ బాబు డిమాండ్ చేశారు. సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు, తద్వారా జరిగిన తీవ్ర ప్రాణనష్టం పైన మానవ హక్కుల వేదిక బృందం బుధవారం నిజనిర్ధారణ జరిపింది. ఇంకా శవాల వెలికితీత పూర్తి కాకపోవడం, కంపెనీ పేరు తప్ప యాజమాన్యం పేర్లు ఇప్పటికీ బయటికి రాకపోవడం, మృతుల కుటుంబాలకు సమాచారం అందకపోవడం వంటి విషయాలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక హైదరాబాద్ ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, కమిటీ సభ్యులు వసంతలక్ష్మి, రోహిత్ ఉన్నారు.

'57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దళితులలో అత్యంత వెనుకబడిన ఎంబీసీ 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని 57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు భైరి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాల దాసరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భైరి వెంకటేష్ మాట్లాడుతూ దళితులకు వచ్చే అన్ని ఫలాలు అట్టడుగున ఉన్న 57 కులాలకు కూడా దక్కాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాల దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మద్దెల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'దేశ ప్రజల ప్రయోజనాలు ట్రంప్ వద్ద తాకట్టు'

హిమాయత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రయోజనాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దగ్గర మోదీ తాకట్టు పెట్టారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూర్ ధర్మేంద్ర ఆరోపించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై దాడులు జరుగుతున్నా.. మోదీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అమెరికాలో భారతీయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చలో అమెరికన్ కాన్సులేట్ కార్యక్రమాన్ని చేపట్టారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ప్రారంభమైన నిరసనను సమీపంలోనే అడ్డుకుని నేతలను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరసన కార్యక్రమంలో సమాఖ్య నేతలు శ్రీనివాసులు, సల్మాన్‌బేగ్, కల్యాణ్, నాగరాజు, మధుకర్, సునీల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్రపతి ఆమోదించేలా కృషి చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం ఓ లేఖ రాశారు. రాష్ట్రపతి ఆమోదానికి బిల్లులు పంపి చాలాకాలం అవుతోందని, బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడింది

- శాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడి.. లోపభూయిష్టంగా ఉందని శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అబిడ్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన హై పెర్ఫార్మన్స్ అకాడమీల స్థాపనపై నూతన క్రీడా విధానంలో కనీస ప్రస్తావన లేదని విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు నెగ్గిన వారికి ఇచ్చే ఉద్యోగాలపై పాలసీలో స్పష్టత ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. శాట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కోచ్‌ల క్రమబద్ధీకరణ, కొత్త కోచ్‌ల నియామకాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్టేడియాలు, స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.

మణికొండలో రూ. కోటిన్నర విలువైన డ్రగ్స్ స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్స్ అరెస్ట్

నార్సింగ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ వైఎస్‌ఆర్ కాలనీలో రూ. కోటిన్నర విలువైన 650 గ్రాముల హెరాయిన్ డ్రగ్స్, 84 గ్రాముల పాపీస్ట్రా మాదక ద్రవ్యాలను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తుల వద్ద డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మాదక ద్రవ్యాలను రాజస్థాన్ నుంచి నగరానికి దిగుమతి చేసుకున్నట్లు తెపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

లష్కర్ బోనాలకు ముస్తాబవుతున్న ఆలయాలు

సికింద్రాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బోనాల జాతరను ఈ ఏడాది కూడా అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంతోపాటు లష్కర్‌లోని ఇతర అమ్మవారి ఆలయాల్లో సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. కాగా ఈ ఏడాది బోనాల జాతరలో భాగంగా తొలి అంకమైన ఘటోత్సవం ఆదివారం ప్రారంభం కాగా బోనాల పండుగ జూలై 13, 14వ తేదీల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో ఉజ్జయినీ మహాకాళి ఆలయంతోపాటు అన్ని అమ్మవారి ఆలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. సోమసుందరం వీధిలోని పోచమ్మ ఆలయం, కళాసిగూడలోని ముత్యాలమ్మ ఆలయం, రాష్ట్రపతి రోడ్డులోని మావురాల పెద్దమ్మ ఆలయం, కుమ్మరిగూడ సమీపంలోని డొక్కలమ్మ ఆలయం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రోడ్డులోని పీనుగుల మల్లన్న ఆలయం, నల్లగుట్టలోని ముత్యాలమ్మ ఆలయం తదితర దేవాలయాలను బోనాల జాతరకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయాలకు రంగులు వేయడం, సిరీస్ లైట్లు ఏర్పాటు చేయడం, ఆలయానికి చుట్టుపక్కల పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం, గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయడం, డ్రైనేజీ నీరు పొంగి ప్రవహించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం తదితర పనులపై దృష్టి సారించారు.


మావురాల పెద్దమ్మ ఆలయం


సోమసుందరం వీధిలోని పోచమ్మ ఆలయం


డొక్కలమ్మ ఆలయం

భక్తులకు సదుపాయాలు కల్పించాలి


మహాకాళి అమ్మవారికి సమర్పించే పోచంపల్లి పట్టు వస్త్రాలను మగ్గంపై తయారు చేసే పనులు ప్రారంభిస్తున్న తలసాని

సికింద్రాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగిందని సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం ప్రాంగణంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి పట్టు వస్త్రాలను మగ్గంపై తయారు చేసే పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో తలసాని మాట్లాడుతూ ఎల్లమ్మ కల్యాణం మాదిరిగానే ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల జాతరకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే బోనాల జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి లక్షలాదిమంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, అనువంశిక ధర్మకర్త సురిటి కామేష్, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కోశికె కిశోర్, నాగులు, మహేష్, ఆంజనేయులు, కోటేశ్వర్‌గౌడ్, చంద్రప్రకాష్, అరుణ్‌భట్, జయరాజ్, రాఘవేంద్ర, విశ్వనాథం, సునీత, రూప తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- ఏసీపీ సుబ్బయ్య

అడ్డగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య ఆలయ నిర్వాహకులకు సూచించారు. బుధవారం గోపాలపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆలయాలు, మజీద్‌ల నిర్వాహకులతో పీస్ కమిటీ ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే బోనాల సందర్భంగా సికింద్రాబాద్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలీసులు పెట్రోలింగ్‌లో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం సీఐ మధు కుమార్‌తో పాటు ఎస్సైలు మజీద్, ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎస్సీ సెల్ మహిళా విభాగం కన్వీనర్‌గా ఎన్నికైన తుకారాంగేట్‌కు చెందిన రామలీలకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ నాగరి, ప్రీతం.

\- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



ఘటానికి పూజలు

ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఘటానికి బుధవారం పూజలు చేస్తున్న రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి


ఓపెన్ నాలా పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న శ్రీగణేష్

సమస్యల పరిష్కారానికి కృషి: శ్రీగణేష్

సికింద్రాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో వరదనీటి, మురుగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 2వ వార్డు రసూల్‌పురా హాకీ గ్రౌండ్ ప్రాంతంలో ఓపెన్ నాలా పునర్నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

రెజిమెంటల్‌బజార్, జూలై 2(ఆంధ్రజ్యోతి): పాండురంగ విఠలేశ్వర వేంకటాద్రిస్వామి ఆలయం(సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్)లో బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ అల్లాడి గౌరీశంకర్,ఈఓ సత్యనారాయణ తెలిపారు. బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రాలను ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేటర్ కొంతం దీపికకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు నందికంటి రవి, కె.శ్రీనివాస్, ఎక్స్ అఫిషియో రాజగోపాలచార్యులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న క్రిస్టియన్ డే ప్రతినిధులు

నేడు వైఎంసీఏలో ఇండియన్ క్రిస్టియన్ డే

రెజిమెంటల్‌బజార్, జూలై 2(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు సెయింట్ తోమా వర్ధంతిని 'ఇండియాన్ క్రిస్టియన్ డే' గా జరుపుకోవాలని రెవరెండ్ డాక్టర్ సామ్యూల్ దేవరాజ్ పెరుమాళ్, రాజు అలెక్స్, రాబర్ట్ సూర్యప్రకాశ్ పిలుపు ఇచ్చారు. బుధవారం సికింద్రాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ యేసుక్రీస్తుతో కలిసి జీవించి, సువార్త పరిచర్య చేసిన 12 మంది శిష్యుల్లో ఒకరైన తోమా క్రీ.శ.52లో భారత్‌కు వచ్చారని తెలిపారు. 3వ తేదీ సాయంత్రం సికింద్రాబాద్ వైఎంసీఏలో నిర్వహించే క్రిస్టియన్ డేకు పెద్ద ఎత్తున క్రైస్తవులు హాజరు కావాలని తెలిపారు.


శ్రీనివాస్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్‌ను అగ్రస్థానంలో నిలుపుతాం

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడతామని స్థానిక శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో వెంకటేశ్వరనగర్‌లో రూ.25లక్షలు, మార్కండేయనగర్‌లో రూ.28లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, రూ.14లక్షలతో సీతాఫల్‌మండి జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు మరమ్మత్తు పనులకు స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అధికారులు మరమ్మతుల పనుల్లో నిర్లక్ష్యం వ్యవహరించరాదని సూచించారు. అనంతరం కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ ఇప్పటికే సీతాఫల్‌మండిలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని తొందరంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్వర్ణలత, కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, కరాటేరాజు, శైలేందర్, నవీన్, బెజ్జంకి రాజేష్, పాకసాయి, సునీల్ ముదిరాజ్, నాగేశ్వరరావు, రవీంద్రసాగర్, అజీజ్, సమన్వయకర్త రాజుసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో కాలికి గాయమై చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావును సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం పరామర్శించారు. పద్మారావునగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ కూడా ఉన్నారు. అలాగే తెలంగాణ హోమియోపతి డాక్టర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చినుకని శివప్రసాద్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని కొన్ని హోమియోపతి మందులను అందించారు.

\- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి

పౌరులకు అందుబాటులో సిబ్బంది : ఎంఆర్‌ఓ భిక్షపతి


ఎంఆర్‌ఓ భిక్షపతి

తిరుమలగిరి జూలై 2 (ఆంధ్రజ్యోతి): వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమలగిరి మండల పరిధి లోని బస్తీ, కాలనీ వాసుల ఇళ్లలోకి వర్షం నీళ్ల చేరి ఇబ్బందులు తలెత్తిన తమకు సమాచారం తమకు సమాచారం అందించాలని ఎంఆర్‌ఓ భిక్షపతి తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. పాత భవనాలు, శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపించినా తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. నాలాల పక్కన నివాసం ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సునీల్‌కుమార్ (గిర్దావర్)- 7989545988, భాను చందర్ (స్పెషల్ ఆర్ఐ) - 6301566431, హేమంత్ అఖిల్ (స్పెషల్ ఆర్ఐ) -7093458406, వంశీ (స్పెషల్ ఆర్ఐ) - 8309201729, శేఖర్ (రెకార్డ్ అసిస్టెంట్) - 9697311115 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


సులేమాన్‌ఖాన్

బౌద్ధనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): టీ తాగడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ హిండేన్ గ్రామానికి చెందిన సులేమాన్‌ఖాన్(35) ఏడు నెలలుగా నామాలగుండు ఉప్పరబస్తీలో ఆసిఫ్‌ఖాన్ ఇంటిలో అద్దెకు ఉంటూ టైల్స్ ఫిటింగ్ పనులు చేస్తూ ఉంటాడు. ఇతడికి కొద్దిగా అంగవైకల్యం ఉంది. సులేమాన్‌ఖాన్ ఆసిఫ్‌ఖాన్ వద్దే టైల్స్ పనులు చేస్తున్నాడు. జూన్ 30న సాయంత్రం 6:30 సమయంలో టీ తాగటానికి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి వద్ద సెల్‌ఫోన్ లేదు. పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన ఇంటిలో అద్దెకు ఉండే వ్యక్తి కనిపించటంలేదని ఆసిఫ్‌ఖాన్ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

తార్నాక, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : తార్నాక డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో సమావేశమైన ఆమె స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం తార్నాక డివిజన్ జలమండలి అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన వినయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలన ప్రశాంతం

మారేడుపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో బుధవారం ఎంసెట్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన రెండవ రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గంటకు 60 మంది చొప్పున ధ్రువ పత్రాలను అధికారులు పరిశీలించారు. హెల్ప్‌లైన్ సెంటర్‌లో తరచూ సర్వర్ డౌన్ అవ్వడంతో విద్యార్థులు వారి పేరెంట్స్ ఇబ్బందులకు గురయ్యారు. ఈ క్రమంలో అధికారులకు విద్యార్థులకు మధ్య కొద్దిగా గలాటా జరిగింది. పోలీసుల చొరవ తీసుకోవడంతో ప్రశాంతంగా జరిగింది.

డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- ఏసీపీ గోపాల కృష్ణమూర్తి

బోయినపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని; గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కాలు ప్రమాదకరమని; ఆకతాయిలు వేధిస్తే వెంటనే మహిళలు షీటీంలకు సమాచారం అందించాలని బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణ మూర్తి అన్నారు. బోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపాల్ బానోతు లాలూ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొని వాల్‌పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో విద్యార్థులకు పలు సూచనలు సలహాలను అందించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 14446, 1930 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చట్టపరమైన చైతన్యం, భద్రతపై అవగాహన పెంపొందించి, సమాజాన్ని సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లాలూ నాయక్, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ అముక్త మాల్యా, ఎల్లమ్మ, ఎస్ అవినాష్, ఎస్ఐలు అవినాష్ బాబు, గణేష్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళల పైన నేరాల పైన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ గోపాల కృష్ణమూర్తి